

సోమశిలలో 72.6 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 72.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3100 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,093
3 శాతం జీఎస్టీతో	రూ.7,306
నవర (8 గ్రా)	రూ.58,448

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.6 /24.2

జిల్లాలో అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు శుక్రవారం కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 95 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

సీఎస్‌ను కలిసిన కలెక్టర్



నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ నెల్లూరులోని ఆర్ అండ్ బీ అతిథిగృహానికి గురువారం రాత్రి చేరుకున్నారు. విజయవాడ నుంచి వెళ్తూ మార్గమధ్యలో ఇక్కడ విశ్రాంతి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయన్ను కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్, డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. జిల్లా అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో కొద్దిసేపు చర్చించారు.

పరీక్షల్లో బాలుడికి జికా నెగటివ్



పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): మర్రిపాడు మండలంలోని వెంకటాపురానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ సోకిందనే వార్తలు కలకలం రేపాయి. బాలుడితో పాటు తల్లిదండ్రుల రక్త నమూనాలను సేకరించి చెన్నైలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఆధ్వర్యంలో స్టేట్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ వారు పరీక్షించగా, జికా వైరస్ లేదనే అంశం నిర్ధారణైంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ పరీక్షలు చేయగా, అందులోనూ నెగటివ్ వచ్చింది. ఈ విషయాలను అక్కడి అధికారులు తెలిపారని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. కాగా చెన్నైలోని ఎగ్మోర్ బేబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.

గ్రామంలో జికా లక్షణాల్లేవు

మర్రిపాడు మండలంలోని వెంకటాపురం ప్రజలకు జికా వైరస్ లక్షణాల్లేవని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలను గురువారం ఆయన తెలియజేశారు. గ్రామంలోని ఆరేళ్ల చిన్నారి మూర్ఛ వ్యాధితో నారాయణ ఆస్పత్రిలో ఈ నెల ఏడున చేరారని, జ్వరం వస్తుండటంతో లక్షణాలను పరిశీలించి మెనింజో ఎన్‌సెఫలైటిస్ వ్యాధిగా గుర్తించి ముంబైలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌కు రక్త నమూనాలను పంపారని చెప్పారు. జికా వైరస్ అనే రిపోర్టును ల్యాబ్ ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రైవేట్ ల్యాబ్ కావడంతో వైరస్ నిర్ధారణ కోసం బాలుడితో పాటు తల్లిదండ్రులు, చుట్టుపక్కల మరో 20 మంది రక్త నమూనాలను సేకరించి వాటిని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపనున్నామని వెల్లడించారు.

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు



నెల్లూరు రూరల్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పీఎంఈజీపీ రుణాల మంజూరు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తదితర అంశాలను జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పరిశ్రమలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువుకు ముందే అనుమతులను జారీ చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. గోల్డ్, ప్రింటింగ్, రెడీమెడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై దృష్టి సారించాలని సూచించారు. గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు గానూ నిర్వాహకులు నెల్లోపు ముందుకు రావాలని, లేని పక్షంలో రద్దు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు గానూ పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్, పరిశ్రమల శాఖ జీఎం సమన్వయంతో మెగా క్యాంప్‌ను ఏర్పాటు చేసి రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జేసీ కార్తీక్, ఏపీఐఐసీ జెడ్‌ఎం శేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఎల్డీఎం శ్రీకాంత్, ప్రదీప్, డీఆర్డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవానీ, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, డీటీసీ చందర్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట



ఉదయగిరి అటవీ ప్రాంతం



వేటగాళ్ల ఉచ్చుకు విలవిల

- నాటు తుపాకుల వినియోగం
- పేట్రేగిపోతున్న ముష్కరులు
- చోద్యం చూస్తున్న అధికారులు



జిల్లాలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో విస్తరించిన అడవుల్లో సందడి చేసే పెద్ద పులులు, చిరుతలు, నెమళ్లు, జింకలు, దుప్పులు, అడవి పందులు తదితరాలపై ప్రస్తుతం వేటగాళ్లు గురిపెట్టారు. నిత్యం ఎక్కడో ఓ చోట వీటిని వధిస్తునే ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇంత జరుగుతున్నా, చోద్యం చూడటం అటవీ శాఖ అధికారుల వంతవుతోంది.

ఉదయగిరి: కొందరి ధన దాహానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. అటవీ ప్రాంతాన్ని తమ ఆవాసంగా చేసుకొని స్వేచ్ఛగా జీవించే వన్యప్రాణులను వధించి మాంసాన్ని విక్రయిస్తూ.. వాటి ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. జిల్లాలో 2.29 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూములు ఉండగా, వీటి పరిధిలో రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌లు ఉన్నాయి. ఇక్కడ అధికంగా జింకలు, దుప్పులు, అడవి పందులు, ఎలుగుబంట్లు, చిరుతలు, పెద్దపులి వంటి జంతువులు.. నెమళ్లు, ఇతర జాతికి చెందిన వివిధ రకాల పక్షులున్నాయి.

గుట్టుచప్పుడు కాకుండా..

జింకలు, దుప్పులు, అడవి పందులు ఎక్కువగా సమీప గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతుంటాయి. ఈ క్రమంలో కొందరు వేటగాళ్లు అదును చూసి వీటిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతోంది. వధించారనే సమాచారం బయటకు చాలా అరుదుగా పొక్కుతుంది. ఈ విషయం మీడియాలో వచ్చి బయట ప్రపంచానికి తెలిస్తేనే అటవీ అధికారులు కేసులు నమోదు చేస్తారు. లేకపోతే ఎవరికీ తెలిసే అవకాశం ఉండదు.

అత్యంత హేయంగా..

దట్టమైన అటవీ ప్రాంతంలో నైపుణ్యం గల వేటగాళ్లు నాటు తుపాకులతో వేటాడుతున్నారు. కణితి, జింక, దుప్పి, నెమళ్లను వీటితో వధిస్తున్నారు. వీటి మాంసానికి మార్కెట్లో గిరాకీ ఉండటంతో వేటాడి ముందస్తు ఒప్పందం మేరకు అందజేస్తున్నారు. ఆపై అవశేషాలు మచ్చుకైనా కనిపించకుండా మాయం చేస్తున్నారు. జింకలు, అడవి పందులను విద్యుత్ వైర్లు, ఉచ్చుల ద్వారా వధిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట ఈ తంతు రాత్రి వేళ జరుగుతూనే ఉంది. కుందేళ్లు, కంజు, జవుదు కాకి తదితరాలను వలల ద్వారా పట్టుకుంటున్నారు. రావూరు రేంజ్ పరిధిలోని ఓ గిరిజన కాలనీకి చెందిన ముగ్గురు వేటగాళ్లు వేట సమయంలో నాటు తుపాకీని ఇటీవల వినియోగించారు. అయితే పొరపాటున ఓ వ్యక్తికి తగిలి మృతి చెందారు.



ప్రాణాలు విడిచిన దుప్పి (ఫైల్)

వన్యప్రాణులతో పర్యావరణ సమతుల్యత



కీలకంపర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణుల పాత్ర కీలకం. జంతువులు, పక్షుల ద్వారా మానవ జాతికి ఎంతో మేలు జరుగుతుంది. వీటి ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుంది. అడవులు, వన్యప్రాణులు, వృక్ష సంపదను కాపాడుకోవాలి.

– అశోక్, విశ్రాంత ఉపాధ్యాయుడు

వధిస్తే జైలు శిక్ష తప్పదు



వన్య ప్రాణులను వధిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఏడేళ్ల నుంచి గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. అడవుల్లో ఉండే ఏ ప్రాణినైనా చంపడం చట్టరీత్యా నేరం. ఈ విషయమై అటవీ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– కుమార్‌రాజా, రేంజర్, ఉదయగిరి

కొరవడిన నిఘా

అత్మకూరు రేంజ్ పరిధిలోని మర్రిపాడు మండలంలో అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న కొన్ని పల్లెలకు చెందిన వేటగాళ్లు దుప్పి, కణితులను వేటాడి వాటి మాంసాన్ని దూర ప్రాంతాలకు తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తుంటారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రాత్రి వేళ పైర్ల వద్ద విద్యుత్ వైర్లను ఉపయోగించి పందులు, జింకలను వధిస్తున్నారు. ఉదయగిరి దుర్గం సమీపంలో బుధవారం గుర్తించిన అవశేషాలు అడవి ఆవులవని భావిస్తున్నా, పశు వైద్యుడి నివేదిక రావాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో గతంలో వన్యప్రాణుల అవశేషాలను గుర్తించారు. మరోవైపు ఈ విషయం కొందరు అటవీ సిబ్బందికి తెలిసినా, తగు చర్యలు చేపట్టడంలేదనే విమర్శలున్నాయి. వేటగాళ్ల ఉచ్చు నుంచి వన్యప్రాణులను అటవీ శాఖ అధికారులు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనను గురువారం విడుదల చేసింది.

- వలంటీర్లు, దివ్యాంగుల విభాగాల జిల్లా అధ్యక్షులుగా గూడూరు నియోజకవర్గానికి చెందిన మహేంద్ర, చల్లా మోహన్ నియమితులయ్యారు.
- ఐటీ, డాక్టర్స్, బూత్ కమిటీ విభాగాల జిల్లా అధ్యక్షులుగా ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన కొప్పోలు వెంకటేశ్వర్లు, ప్రణీత్, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డిని నియమించారు.
- ఇంటలెక్చువల్స్ ఫోరమ్, కల్చరల్ విభాగాల జిల్లా అధ్యక్షులుగా కందుకూరు నియోజకవర్గానికి చెందిన రావులకొల్లు బ్రహ్మానందం, కంపరాజు సాంబశివరాజు నియమితులయ్యారు.
- ఎస్సీ సెల్, ఆర్టీఐ, లీగల్‌సెల్ విభాగాల అధ్యక్షులుగా కావలి నియోజకవర్గానికి చెందిన పందింటి కామరాజు, మద్దినేని వీరరఘు, కాటా సురేంద్రరెడ్డిని నియమించారు.
- రైతు విభాగం, మున్సిపల్ విభాగాల జిల్లా అధ్యక్షులుగా కోవూరు నియోజకవర్గానికి చెందిన పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు.
- యూత్ వింగ్, మైనార్టీసెల్, స్టూడెంట్‌సెల్, వాణిజ్య విభాగాలకు జిల్లా అధ్యక్షులుగా నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన ఊటుకూరు నాగార్జున, సిద్దిక్, ఆశ్రితరెడ్డి, మంచికంటి శ్రీనివాసులును నియమించారు.
- మహిళా విభాగం, ఎస్టీసెల్, అంగన్‌వాడీ వింగ్ విభాగాల జిల్లా అధ్యక్షులుగా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన కాకుటూరు లక్ష్మీ సునంద, పోతురాజు చంద్రశేఖర్, లావణ్య నియమితులయ్యారు.
- పంచాయతీరాజ్ వింగ్, గ్రీవెన్స్ సెల్ విభాగాల జిల్లా అధ్యక్షులుగా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఆలపాక శ్రీనివాసులు, తలమంచి సురేంద్రబాబును నియమించారు.
- క్రిస్టియన్ మైనార్టీ సెల్, వైఎస్సార్టీయూసీ విభాగాల జిల్లా అధ్యక్షులుగా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన కాళహస్తి భువన్ అనుదీప్, జయకుమార్‌రెడ్డి నియమితులయ్యారు.
- బీసీసెల్, సోషల్ మీడియా వింగ్, పబ్లిసిటీ విభాగాల జిల్లా అధ్యక్షులుగా ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన డేగా వంశీకృష్ణ, కోటంరెడ్డి రాజేంద్ర, అక్కినపల్లి నరసింహారెడ్డిని నియమించారు.
- చేనేత విభాగ జిల్లా అధ్యక్షుడిగా వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన జానకిరామయ్య నియమితులయ్యారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు


నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు గురువారం కురిశాయి. ముత్తుకూరు, ఇందుకూరుపేట, సైదాపురం మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. మరో 25 మండలాల్లో చిరుజల్లులే కురిశాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది. నెల్లూరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు, రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. మరోవైపు జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు శుక్రవారం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలను డీఈఓ బాలాజీరావు ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించిన అనంతరం పదో తరగతి విద్యార్థుల పాఠ్య ప్రణాళికలపై సమీక్షించారు. 7, 8, 9వ తరగతుల ఎస్‌ఏ – 1 పరీక్ష తీరును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు గానూ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో నూరు రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామని వెల్లడించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు తగిన విధంగా బోధన చేసి వారు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుదరని సయోధ్య

- మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపికలో తర్జనభర్జన
- ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టేందుకు యత్నం



నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపికలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య కుదరడంలేదు. ఫలానా నియోజకవర్గంలో తమ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే ఇవ్వాలని కొందరు పట్టుబడుతుండటం.. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో తమ వారికి అవకాశం లేకుండాపోతుందని.. తమకే ఇవ్వాలని మరి కొందరు భీష్మించుకోవడంతో ఎంపిక విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ వ్యవహారంతో ఉన్నతాధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీపై రెండు రోజుల క్రితం సమావేశం జరిగినా, అది ఓ కొలిక్కిరాలేదు. దీంతో సమావేశాన్ని మధ్యలోనే ముగించారని తెలుస్తోంది.

ఎనిమిది కమిటీల్లోనూ ఇదే తీరు..

జిల్లాలో నెల్లూరు, కావలి, కోవూరు, కందుకూరు, పొదలకూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమించాల్సి ఉంది. గతంలో రిజర్వేషన్ ప్రకారం నియామక ప్రక్రియను చేపట్టారు. అయితే ప్రస్తుతం దాని ప్రకారం ముందుకెళ్తే తమకు అనుకూలంగా ఉండే వారికి అవకాశం రాదనే ఆందోళనతో ప్రజాప్రతినిధులు తిరస్కరిస్తున్నారని సమాచారం. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంశాన్ని అధికారులు లేవనెత్తడంతో ప్రజాప్రతినిధులు అంగీకరించలేదని సమాచారం.

వారికి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక..

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో నామినేటెడ్ పదవుల్లో బీజేపీ, జనసేనకూ పదవులను కేటాయించాల్సిన పరిస్థితి. అయితే ఈ అంశం అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు రుచించడం లేదు. నిబంధనల మేరకు వెళ్తే కొన్ని చోట్ల వీరికి అవకాశం వస్తుందని.. అలా కాకుండా తాము సూచించిన సామాజికవర్గానికే వచ్చేలా చూడాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం.

పక్కా ప్లాన్

ఏ నియోజకవర్గంలో అయితే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై బీజేపీ, జనసేన ఆశ పెట్టుకున్నాయో, ఆ ప్రాంతంలో ఆ సామాజికవర్గానికి కాకుండా, తమకు అనుకూలంగా ఉన్న వారికి వచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యేలు ప్లాన్ వేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక కూటమిలో చిచ్చు రాజేస్తోంది.

తమ్ముళ్లకు చౌక పందేరం

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం.. టీడీపీ నేతల ఆర్థిక పరిపుష్టికి మాత్రం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే ఇసుక.. మద్యం.. తదితరాలను కట్టబెట్టిన ఆ పార్టీ పెద్దలు.. తాజాగా రేషన్ షాపులనూ వారే కొల్లగొట్టేలా పావులు కదుపుతున్నారు. రోస్టర్ తదితర నిబంధనలను పాటించి చౌక దుకాణాలను అర్హులకు అప్పగించాల్సి ఉన్నా, అదేమీ అమలుకావడంలేదు.

- టీడీపీ నేతలకు రేషన్ షాపులు
- పావులు కదుపుతున్న ప్రభుత్వం
- జిల్లాలో 412 దుకాణాల ధారాదత్తం



నెల్లూరు (పొగతోట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తల జేబులు నింపేందుకు అనేక యత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చౌక దుకాణాలను వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఇదీ తంతు..

అధిక సంఖ్యలో రేషన్ కార్డులున్నాయనే సాకుతో విభజన ద్వారా 146.. 6ఏ కేసులు తదితర కారణాలతో తొలగించిన 266 రేషన్ షాపులను టీడీపీ నేతలకు కట్టబెట్టనున్నారు. వాస్తవానికి రోస్టర్ తదితర నిబంధనలను పాటించి చౌక దుకాణాలను అర్హులకు అప్పగించాల్సి ఉంది. ఖాళీగా ఉన్న వాటికి ఆర్డీఓ ఆధ్వర్యంలో నోటిఫికేషన్‌ను జారీ చేసి రాత పరీక్ష, ఇంటర్వ్యూ అనంతరం అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే వీటిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి తమ వారికి లబ్ధి చేకూర్చడమే పరమావధిగా వ్యవహరిస్తోంది.

రేషన్ షాపులపై కన్ను

జిల్లాలో 1513 చౌకదుకాణాలకు గానూ 7.3 లక్షల మంది కార్డుదారులున్నారు. వీరికి ప్రతి నెలా 12 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అధికమైంది. నగరంలో బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వ్యాపారి అంతా తానై వ్యవహరిస్తూ.. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులకు లక్షల్లో ముట్టజెప్తున్నారని సమాచారం. ఈ తంతు యథేచ్ఛగా సాగుతుండటంతో పచ్చనేతల కన్ను చౌకదుకాణాలపై పడింది. దీంతో వీటిని దక్కించుకునేందుకు భారీ స్థాయిలో యత్నాలు చేస్తున్నారు.

కందుకూరులో బెదిరింపులు

కందుకూరు డివిజన్లో చౌక దుకాణాల కేటాయింపు కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రస్తుత డీలర్లను బెదిరించి మరీ రాజీనామాలు చేయిస్తున్నారు. వీరిపై లేనిపోని కేసులు నమోదు చేసేందుకు సైతం అధికార పార్టీ నేతలు వెనుకాడటం లేదు. కూటమి నేతల సిఫార్సు లేని డీలర్లు రేషన్ షాపులను వదులుకుంటున్నారు.

ఏళ్లుగా నమ్ముకొని.. రోడ్డున పడి

జిల్లాలో ఖాళీ అయిన 412 చౌక దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వకుండా మంత్రులు, ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వారి పేర్లను రాసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో జిల్లా వ్యాప్తంగా చౌకదుకాణాలపై ఆధారపడి ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న డీలర్లు రోడ్డున పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో వీటిని వదులుకునేందుకు మరికొందరు సిద్ధమవుతున్నారు.

నిబంధనల మేరకే కేటాయింపు

జిల్లాలో 412 చౌకదుకాణాలు ఖాళీగా ఉన్నాయి. నోటిఫికేషన్ ఇచ్చి రోస్టర్ ప్రకారం భర్తీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఆయా డివిజన్ల ఆర్డీఓల ఆధ్వర్యంలో జరుగుతుంది. నిబంధనల మేరకు కేటాయించేలా చర్యలు చేపడతాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

మంచు మనోహరం


ఓవైపు పచ్చదనం.. మరోవైపు మంచు తెరలు


కమ్మేసిన మంచు దుప్పటి

కనుచూపు మేరంతా మంచు దుప్పటే. ఈ వేళలో నెల్లూరు కొత్త అందాలను అద్దుకుని దర్శనమిస్తోంది. ఉదయం 8 గంటలు దాటినా మంచు తెరలు తొలగడం లేదు. దట్టమైన పొగమంచులో పంట పొలాల అందాలను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదిస్తున్నారు. ముత్తుకూరు రోడ్డులో గురువారం కనిపించిన మనోహర దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నిండుకుండలా 'స్వర్ణాల'

నెల్లూరులోని స్వర్ణాల చెరువు నిండుకుండలా మారింది. ఓవైపు గుర్రపుడెక్క కమ్మేసింది. పక్షుల కిలకిలరావాలు, నీటి పరవళ్లతో ఆ ప్రాంతం ఆహ్లాదాన్ని పంచుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


గేదెపై ఠీవిగా నిలబడిన కాకి


స్వర్ణాల చెరువు


చెరువు వద్ద పక్షులు

క్లుప్తంగా

23న డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈనెల 23వ తేదీన నెల్లూరు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లూస్టార్, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ, క్రిస్ ఫైనాన్షియల్ లిమిటెడ్ తదితర కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలియజేశారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎం ఫార్మసీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 86398 67407, 99888 53335 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన కార్యాలయ ప్రారంభం నేడు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని డైకస్‌రోడ్డు సమీపంలో సాయిరాంనగర్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదురుగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. దీనిని శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల మధ్య ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొననున్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

నెల్లూరు సిటీ: చెల్లిని బాగా చూసుకుంటున్నారని, తనను పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులపై అలిగి లేఖ రాసి రూరల్ మండలంలోని దేవరపాళెంలోని గురుకుల పాఠశాల నుంచి వెళ్లిపోయిన 9వ తరగతి విద్యార్థి శ్రీను ఆచూకీని రూరల్ పోలీసులు గురువారం గుర్తించారు. కావలి మండలానికి చెందిన ప్రసాద్, వెంకటరమణమ్మల కుమారుడు శ్రీను మంగళవారం గురుకుల పాఠశాల నుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. అతను బావట్లలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

కష్టపడి.. ఉన్నత శిఖరాలకు..

- యోగాలో రాణిస్తున్న నెల్లూరు మహిళ
- గురువుగా ఎందరికో శిక్షణ
- పోటీల్లోనూ ప్రతిభ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనారోగ్యం ఆమెను యోగా వైపు అడుగులు వేయించింది. సమస్య పరిష్కారమయ్యాక దానిని విడిచి పెట్టలేదు. కెరీర్‌గా మార్చుకుని శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. అంతటితో ఆగకుండా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తోంది.


ఉత్తమ యోగా గురువుగా ప్రశంసాపత్రం అందుకుంటూ.. (ఫైల్)


సౌతిండియా చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన పద్మావతి తదితరులు

పబ్బులేటి పద్మావతిది వైఎస్సార్ జిల్లాలోని మాధవరం. విద్యాభ్యాసమంతా అక్కడే గడించింది. ఆమె సైనస్ సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడేది. ఈ క్రమంలో అన్న ప్రకాష్ నారాయణ సూచన మేరకు యోగా సాధన మొదలుపెట్టింది. అయితే అవగాహన లేమితో అది ముందుకు సాగలేదు. ఈ సమయంలో నెల్లూరుకు చెందిన బాలాజీ అనే వ్యక్తితో వివాహమైంది. ఆ తర్వాత పద్మావతి పూర్తిగా యోగా సాధన ప్రారంభించారు. అవినాష్, అభిలేష్ అనే కుమారులున్నా యోగాకు మాత్రం దూరం జరగలేదు. కష్టపడటంతో అనారోగ్య సమస్య తగ్గింది. దీంతో యోగాలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిర్ణయించుకుని ముందుకు సాగింది. 2010వ సంవత్సరంలో భగవద్గీత, యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. యోగాలో వివిధ కోర్సులు పూర్తి చేసి శిక్షకురాలిగా మారారు. బ్రెయిన్ యోగా, ట్రస్ట్ మేనేజ్‌మెంట్ యోగా తదితర కోర్సులను చేశారు. మహిళలకు తరచూ ప్రసవం తర్వాత వచ్చే ఆరోగ్య సంబంధిత సమస్యలకు యోగా చక్కని జవాబు చెబుతుందని పలువురిని ప్రేరేపించి సాధన చేయిస్తున్నారు.

రాణిస్తూ..

పద్మావతి యోగాలో పలువురికి శిక్షణ ఇస్తూనే పోటీల్లో రాణిస్తున్నారు. ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ శిక్షకురాలిగా 2018లో అప్పటి కలెక్టర్ ముత్యాలరావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. 2021లో పతంజలి కాలేజ్ ఆఫ్ యోగా, రీసెర్చ్ సెంటర్ వారు ఉత్తమ యోగా శిక్షకురాలిగా ప్రశంసాపత్రాన్ని ఇచ్చారు.

చాలా మంచిది

యోగా సాధన చాల మంచిది. విద్యార్థులు తప్పనిసరిగా చేయాలి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నా దగ్గర శిక్షణ తీసుకునే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించడమే లక్ష్యం. నేటి ఉరుకుల, పరుగుల ప్రపంచంలో చిన్నప్పటి నుంచి యోగా సాధన చేయడం ఎంతో ముఖ్యం.

– పద్మావతి



బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే కేసులు


ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ


కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న అధికారులు

- పొరుగు మద్యాన్ని నియంత్రించాలి
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

నెల్లూరు(క్రైమ్): 'బెల్టు షాపులను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలి. వాటికి మద్యం సరఫరా చేసే దుకాణదారులపై కేసులు నమోదు చేయాలి' అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు బీవీనగర్‌లోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్లవారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ నేరాల కట్టడి, నిబంధనల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ ఎక్సైజ్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని, ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయాలన్నారు. పొరుగు మద్యం విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని నిరంతరం దాడులు చేయడంతోపాటు, జిల్లాలోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనధికారికంగా మద్యం విక్రయించే వారిపై సైతం కేసులు నమోదు చేయాలన్నారు. బార్లు, మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు నిర్ణీత వేళల్లోనే మద్యం అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘన, బ్రాండ్ మిక్సింగ్‌లకు పాల్పడేవారిపై కేసులు పెట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. సారా తయారీ, విక్రయాలు, రవాణాను నిర్మూలించాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో ఎక్సైజ్ డీసీ టి.శ్రీనివాసరావు, ఏసీ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎ.శ్రీనివాసులునాయుడు, ఐఎంఎల్ డిపో మేనేజర్ ఆయేషాబేగం, ఏఈఎస్‌లు రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో నూతన దివ్యాంగ క్రికెటర్లు ఈనెల 20వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నెల్లూరు జిల్లా కన్వీనర్ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 97055 43294, 77801 67625 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కండలేరులో 56.700 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 56.700 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 700, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

అల్లూరు: పోక్సో కేసులో అల్లూరుకు చెందిన చెంబేటి మురళి అనే వ్యక్తికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. ఓ బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో 2015 సంవత్సరంలో అల్లూరులోని తన పెద్దమ్మ ఇంట్లో ఉంది. ఈ సమయంలో ఆమె కుమారుడైన మురళి మద్యం తాగి బాలికపై లైంగికదాడి చేశాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన పెద్దమ్మకు చెప్పగా ఏమికాదని సర్ది చెప్పి ఆమంచర్లలోని సెయింట్ జోసెఫ్ హాస్టల్లో చేర్పించింది. బాలికకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రిలో చూపించగా గర్భిణిగా తేలింది. ఐసీపీఎస్ అధికారుల సహాయంతో అప్పట్లో అల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. తగిన సాక్ష్యాలను పొందుపరచగా పైమేరకు జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ కాకుటూరు రమేష్‌రెడ్డి కేసును వాదించారు.

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దాం

- డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న నవజీవన్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఎయిడ్స్ నివారణపై ప్రోగ్రమాటిక్ పాపులేషన్ అండ్ సైజ్ ఎస్టిమేషన్ (పీఎంపీఎస్ఈ) అనే అంశంపై జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణలో ప్రభుత్వంతో కలిసి పనిచేసే ప్రతి ఎన్జీఓ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల్లో వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి మనోధైర్యం కల్పించి వారికి ఉచితంగా మందులు అందించేలా చూడాలన్నారు. అలాగే రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం లాంటి లక్షణాలతో బాధపడుతున్న వారికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఏపీసీయూ సిబ్బంది శివ, టీబీ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.24
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.10



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 105
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 178



కుడి కాలువకు నీటి విడుదలలో జాప్యం


కుడి కాలువ వద్ద విద్యుత్ మోటార్‌ను నీటిలో దించుతున్న క్రేన్

- రోజులు గడిచే కొద్దీ ఎండుతున్న నారుమడులు
- మేఘా సంస్థ ద్వారా మోటార్ల ఏర్పాటు
- నీరు పంపింగ్ చేయకుండానే కాలిపోయిన మోటార్లు

లింగసముద్రం: రాళ్లపాడు కుడి కాలువకు పూర్తి స్థాయిలో నీటి విడుదలలో జాప్యం జరుగుతుండడంతో వరినార్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల నుంచి నీరు విడుదల కాకపోవడంతో పంటను నష్టపోవాల్సి వస్తుందని వాపోయారు. రోజురోజుకు జాప్యం జరిగే కొద్దీ పోసిన నార్లు, నాటిన నాట్లు ఎండుముఖం పట్టి కలుపుతో గడ్డి అల్లుకుపోతుందని చెబుతున్నారు. బుధవారం కుడి కాలువకు 110 క్యూసెక్కులు వెళ్తోందని, ఇంకో 25 క్యూసెక్కులు కాలువకు విడుదల చేస్తే సరిపోతుందని ప్రాజెక్ట్ అధికారులు చెప్పారని, విడుదలైన నీరు మక్కెనవారిపాళెం, ఇసుకపాళెం పొలాల వరకే వెళ్తోందని, చినపవని పెదపవని చివరి భూములకు వెళ్లాలంటే పూర్తిస్థాయిలో కాలువకు నీరు విడుదల కావాల్సి ఉందన్నారు.

పంపింగ్ చేయకుండానే..

మేఘా సంస్థకు సంబంధించిన సిబ్బంది గురువారం కుడి కాలువ తూము వద్ద నీటిలో ఉండి పంపింగ్ చేసే 75 హెచ్‌పీ, 25 హెచ్‌పీ, 16 హెచ్‌పీ కలిగిన మూడు విద్యుత్ మోటార్లను క్రేన్ సహాయంతో అమర్చారు. అయితే 75 హెచ్‌పీ మోటార్ నీరు పంపింగ్ చేయకుండానే కాలిపోయింది. సాయంత్రం వరకు మిగిలిన రెండు మోటర్లు బిగించే ప్రయత్నంలోనే సిబ్బంది ఉన్నారు. అయితే తూము వద్ద సైఫన్ ద్వారా మరో రెండు పైపులు వేసి నీరు వెళ్లేలా చేస్తామని డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

పది మద్యం బాటిళ్ల స్వాధీనం

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. లేటి మాణిక్యమ్మ వద్ద పది మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు.